సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సహించరానివి



భీమిలి చిన్నబజారు జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు



ఆనందపురం ఎస్‌ఐ నరసింహమూర్తికి ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు, నాయకులు

- దిగజారి మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు
- నిరసన వ్యక్తం చేసిన వలంటీర్లు
- పలుచోట్ల కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం

భీమునిపట్నం: వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం స్థానిక వలంటీర్లు తీవ్రంగా స్పందించి నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి చిన్న బజారు జంక్షన్ వద్దకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎంతో పద్ధతిగా పింఛన్ల పంపిణీతోపాటు ఇతర అన్ని పనులు బాధ్యతగా నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని గుర్తు చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా తాము పని చేస్తున్నామని, ఎక్కడైనా ఎవరిపట్లయినా అమర్యాదగా ప్రవర్తించామా అని ప్రశ్నించారు. ఆడపిల్లలను అక్రమంగా రవాణా చేస్తున్నామని అత్యంత నీచంగా ఆరోపించడం ఏమాత్రం సహించరానిదన్నారు. ఇంతగా దిగజారిపోయిన పవన్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అనంతరం భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కొంకి వెంకటేష్, బి.లీల, కొయ్య రామకృష్ణ, పి.ప్రియ, పద్మ, అనూష, జయశ్రీ, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఆనందపురం : తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై వలంటీర్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వలంటీర్లు మహిళల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు చేరవేస్తున్నారని దారుణమైన ఆరోపణలు చేశారని మండిపడ్డారు. కేవలం రూ.5 వేల వేతనంతో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నామని, కరోనా సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడానికి తాము అందించిన సేవలు పవన్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. తమకు బహిరంగ క్షమాపణ చెప్పే వరకు పవన్‌ను విడిచిపెట్టే ప్రసక్తే లేదని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లతోపాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు రౌతు వెంకటరావు, కోరాడ ముసలినాయుడు, లొడగల రమణ, షిణగం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: పవన్ కల్యాణ్ తమపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పద్మనాభం జంక్షన్‌లో సోమవారం సాయంత్రం సచివాలయ వలంటీర్లు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. పవన్ క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వలంటీర్ల మండల కో ఆర్డినేటర్ ఎ.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభంలో పవన్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న వలంటీర్లు



భీమిలి ఎస్‌ఐ తాతారావుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



పద్మనాభం జంక్షన్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

విత్తన శుద్ధితో తెగుళ్ల నియంత్రణ

పద్మనాభం: విత్తన శుద్ధి చేయడం వల్ల రైతుకు మేలు జరుగుతుందని సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని పాండ్రంగి రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీని వల్ల మొలక శాతం పెరగడంతోపాటు విత్తనాల వల్ల వచ్చే తెగుళ్లను 45 రోజుల వరకు నివారించవచ్చన్నారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద బీజామృతం అందుబాటులో ఉంటుందన్నారు. రైతులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సేంద్రియ వ్యవసాయం అసోసియేట్ శ్రీనివాస చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు

అంతర పంటలతో అధిక లాభం

ఆనందపురం : పండ్ల తోటల్లో అంతర పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ప్రాంతీయ అధికారి కృష్ణారావు సూచించారు. మండంలోని పాలవలసలో సోమవారం వ్యవసాయాధికారుల బృందం పంట పొలాలను సందర్శించింది. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ బొప్పాయి, అరటి వంటి పంటలలో అంతర పంటలుగా పువ్వులు సాగు చేయవచ్చన్నారు. అలాగే పంటలకు నీరు పెట్టేటప్పుడు జీవామృతాన్ని నీటిలో కలిపితే చీడపీడలను నివారించవచ్చన్నారు. దీని మూలంగా భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందన్నారు. పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సలహాదారు చక్రవర్తి, యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఒత్తిడితో విద్యార్థిని ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఫార్మసీ కళాశాల వసతిగృహంలో ఆదివారం రాత్రి బీ ఫార్మసీ విద్యార్థిని గవర అంజలి (21) సీలింగ్ హుక్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురం మన్యం జిల్లా, కొత్తవలస టౌన్, రాజీవ్ కొత్త పోలమ్మ కాలనీకి చెందిన భాస్కరరావుకు ఇద్దరు పిల్లలు. వీరిలో పెద్ద కుమార్తె అంజలి బీ ఫార్మసీ చదువుతూ కళాశాల వసతి గృహంలో ఉంటుంది. గత మూడు రోజులుగా భాస్కరరావు తన కుమార్తె అంజలికి ఫోన్ చేస్తుండగా ముభావంగా మాట్లాడుతూ ఉండేది. ఎందుకు ఇలా ఉంటున్నావని తండ్రి అడగ్గా చదువు ఒత్తిడి కారణంగా రాత్రివేళ నిద్రపోవడం ఆలస్యమవుతోందని చెప్పేది. దీనికి తల్లిదండ్రులు సర్ది చెబుతుండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అంజలి ఉరి వేసుకున్న విషయాన్ని గమనించిన వసతి గృహం సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

'జగనన్న సురక్ష' నేడు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

సిస్టమ్ మోడలింగ్‌పై సదస్సు

కొమ్మాది: సిస్టమ్ మోడలింగ్, కంట్రోలర్ డిజైన్లపై అధ్యాపకులు, పరిశోధకులకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ఎన్ఐటీ రాయపూర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభజిత్ ఘోష్ ముఖ్య అతిథిగా హాజరై వీఎల్ఎస్ఐ డిజైన్, సిగ్నల్ ప్రోసెసింగ్, కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన కల్పించారు.

రేషన్ డిపోలోకి పాము

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలోని రేషన్ డిపోలో సోమవారం మధ్యాహ్నం సరకులు పంపిణీ చేస్తుండగా లోపలికి ఓ పెద్ద పాము ప్రవేశించింది. దీంతో డీలర్, వినియోగదారులు అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. నగరానికి చెందిన స్నేక్‌క్యాచర్‌కు డీలర్ సమాచారం అందించగా డిపోలోని బస్తాలు అన్నీ తొలగిస్తే వచ్చి పామును పట్టుకుంటానని చెప్పడంతో ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. స్థానికుల సాయంతో గడ్డ పొగ పెట్టినా సాయంత్రం వరకు పాము బయటకు రాలేదు. దీంతో డిపోకు తాళాలు వేసి పాములు పట్టే వ్యక్తి కోసం డీలర్, స్థానికులు నిరీక్షిస్తున్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో లోయర్, హయ్యర్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన 26 మంది విద్యార్థులకు సోమవారం భీమిలిలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ హిందీ భాష పట్ల భీమిలి చుట్టుపక్కల ప్రజలకు రోజురోజుకూ మమకారం పెరుగుతోందన్నారు. దీనికి నిదర్శనంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



లిల్లీ, గులాబీ, తులసిమాలల అలంకరణలో కొత్తమ్మ తల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం సాయంత్రం భీమిలి మండలం చిప్పాడ భవానీ పీఠానికి చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి లిల్లీ, గులాబీలు, తులసిమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు కొండపేటకు చెందిన దాతలు ఎలిగా రపు సతీష్‌కుమార్, అతని స్నేహితులు సహాయ సహకారాలు అందించారు. మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు కొత్తమ్మ తల్లిని నూతన అలంకరణతో భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు.

భూములు కోల్పోయిన పేదలకు ఇళ్లు ఇవ్వండి

మహారాణిపేట: కొమ్మాది, బక్కన్నపాలెం రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన పేదలందరికీ ఇళ్లు కేటాయించాలని సీపీఎం నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలం జీవీఎంసీ 6వ వార్డులోని కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లోని పేద, దళిత రైతులకు 1978లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎకరా చొప్పున 80 కుటుంబాలకు వ్యవసాయ భూములు కేటాయించిందని గుర్తు చేశారు.

ప్రభుత్వం వాటిని నవోదయ స్కూలు, వికలాంగుల ఐటీఐ, పట్టుపురుగుల పరిశ్రమ, పోలీస్ శిక్షణ కేంద్రం వంటి నిర్మాణాల కోసం తీసుకున్నారు. ఇటీవల జూనియర్ కాలేజీ నిర్మాణ సమయంలో ఈ గ్రామాల రైతులందరూ ఆ ప్రాంతానికి చేరుకొని తమ భూములకు ప్రత్యామ్నాయం చూపాలని ఆందోళన చేపట్టారన్నారు. టీడీపీ హయాంలో నాటి మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ భూములకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అది నెరవేరలేదని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బాధితులందరికీ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, సియాద్రి పైడితల్లి, అప్పలరాజు, వెంకయ్యమ్మ, బంగారమ్మ, నరసయ్యమ్మ, దేవుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పబ్లిక్ డిమాండ్

డెబ్రిస్ డంపింగ్‌తో అధ్వానంగా పరిసరాలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ చంద్రంపాలెం ఎన్‌జీవో కాలనీ వద్ద రాజరాజేశ్వరి ఆలయాన్ని ఆనుకుని క్వారీ లారీల సిబ్బంది డెబ్రిస్ డంపింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఆలయ పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారు. ఇష్టారాజ్యంగా డెబ్రిస్ వేస్తున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకుని ఆలయ పవిత్రతను, పరిసరాలను రక్షించండి.
– తోట సాయి రమేష్, చంద్రంపాలెం.



చంద్రంపాలెం రాజరాజేశ్వరి ఆలయం వద్ద లారీలతో డెబ్రిస్ వేస్తున్న దృశ్యం

డ్రైనేజీలు లేక ఇళ్ల మధ్యే మురుగునీరు



డ్రైనేజీ లేక కాలువలో నిలిచిన మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 8వ వార్డు పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంను ఆనుకుని పీర్‌లెస్ కాలనీలో డ్రైనేజీలు లేవు. దీంతో ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచిపోయి దోమలు, పందులు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీల కోసం గతంలో ఎన్నోసార్లు వార్డు సచివాలయం, మధురవాడ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశాం. అయినప్పటికీ ఎవరూ స్పందించ లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి డ్రైనేజులు నిర్మించాలి.
– వి.అప్పారావు, పీర్‌లెస్ కాలనీ, పీఎం పాలెం.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని డివైడర్‌పై పడిపోయిన విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా మారింది. ఉమర్ అలీషా ఆశ్రమం దాటిన తర్వాత ఇటీవల విశాఖ నుంచి వస్తున్న కారు డివైడర్‌ను, దానిపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. దీంతో విద్యుత్ సంభానికి ఉన్న రాడ్డు డివైడర్‌కు రెండు వైపులా కొద్ది మేరకు రోడ్డు మీదకు వచ్చేసింది. ఇదే ఇప్పుడు సమస్యగా మారింది. రెండు వైపుల నుంచి వెళ్లే వాహనాలకు ఇది తగిలితే ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలైతే వెంటనే అదుపుతప్పి పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



భీమిలి బీచ్‌రోడ్డులో డివైడర్‌పై ప్రమాదకరంగా పడి ఉన్న విద్యుత్ స్తంభం

ఆటోనగర్‌లో నిర్మాణాలు ప్రారంభించాలని ధర్నా

మహారాణిపేట: రాజన్న ఆటోనగర్ పేరుతో కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చేపట్టాలని ఆటోపార్ట్స్, స్క్రాప్ డీలర్లు కోరారు. జిల్లా ఆటోపార్ట్స్ స్క్రాప్ డీలర్స్ అసోసియేషన్, సీపీఎం నాయకులు సంయుక్తంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.గణేష్ మాట్లాడుతూ ఆనందపురం మండలం కణమా గ్రామం సర్వే నంబర్ 50లో 150 ఎకరాల 77 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలానికి రాజన్న ఆటోనగర్ పేరు పెట్టామని, నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా నేటికీ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. సీపీఎం జగదాంబ జోన్ సెక్రటరీ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ జీవనోపాధి కాపాడాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆనందపురంలో కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి

- అనుమతి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అనువైన భవనం కోసం అన్వేషణ
- త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభించడానికి సన్నాహాలు
- స్థానికంగా వాణిజ్య బ్యాంక్‌లకు ధీటుగా సేవలు



ఆనందపురంలో భవనాన్ని పరిశీలిస్తున్న సహకార బ్యాంక్ అధికారులు

ఆనందపురం : ఆనందపురానికి కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి (డీసీసీబీ)ని మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు అధికారులు బ్రాంచి ఏర్పాటుకు అనుకూలమైన భవనాల కోసం అన్వేషిస్తున్నారు. నెల రోజుల్లో బ్రాంచి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. దీంతో మండలంలోని రైతులకు, ప్రజలకు వాణిజ్య బ్యాంక్‌లకు ధీటుగా ఈ బ్రాంచి ద్వారా సేవలు అందనున్నాయి. మండలంలో ఆనందపురం, వేములవలస, శొంఠ్యాం గ్రామాల్లో వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సహకార సంఘాల ద్వారా రూ.5 లక్షల లోపు ఆర్థిక లావాదేవీలకు మాత్రమే అనుమతి ఉంది. రూ.5 లక్షలు దాటితే మధురవాడలో ఉన్న కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల దీర్ఘకాలిక రుణాలు పొందేవారు దూరాభారంగా ఉన్న మధురవాడ వెళ్లి సేవలు పొందవలసి వస్తోంది. స్థానికంగా ఉన్న సహకార బ్యాంకుల ద్వారా వాణిజ్య పరమైన సేవలు అందడం లేదు. దీంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు చేస్తుండడం వల్ల మండల ప్రజలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది.

బ్రాంచి ద్వారా ఉత్తమ సేవలు

వాణిజ్య బ్యాంకుల ద్వారా అందే అన్ని రకాల సేవలను కేంద్ర సహకార బ్యాంక్ బ్రాంచి ద్వారా అందిస్తారు. ఇందులో ప్రారంభించే అన్ని ఖాతాలకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సౌకర్యం కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో లావాదేవీలు, భూములపై తనఖా రుణాలు, బంగారు రుణాలు, ఉద్యోగులకు రుణాలు, డ్వాక్రా మహిళలకు (ముద్ర రుణాలు) వ్యవసాయ రుణాలతోపాటు ట్రాక్టర్లు, వ్యవసాయంలో వినియోగించే పెద్ద యంత్రాలకు రూ.25 లక్షలు వరకు రుణాలు అందిస్తారు. లాకర్ సదుపాయం కల్పిస్తారు. ప్రారంభించిన అన్ని ఖాతాలకు ఏటీఎం కార్డులు జారీ చేస్తారు. ఖాతాదారుల సౌకర్యం కోసం బ్రాంచి వద్ద ఏటీఎం కేంద్రం కూడా ఏర్పాటు చేస్తారు. డిపాజిట్లను స్వీకరించడంతోపాటు అన్ని రకాల వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తారు.

ఆనందపురం జంక్షన్‌లో భవనాల పరిశీలన

ఆనందపురం జంక్షన్‌లోని పూల మార్కెట్ వద్ద అందరికీ అనువుగా ఉండే భవనాలను బ్రాంచి ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ఇటీవల డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ ఆనందపురంలో బ్రాంచి ఏర్పాటు కోసం సహకార బ్యాంకు సిబ్బందితో కలిసి భవనాలను పరిశీలించారు. అందరికీ అనువుగా ఉండే ప్రాంతంలో బ్రాంచి ఏర్పాటు చేస్తామని వర్మ తెలిపారు. ఈ విషయమై సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ పాండ్రంకి అప్పారావు మాట్లాడుతూ నెల రోజుల్లో బ్రాంచి ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 2025 నాటికి వంద కోట్ల రూపాయల టర్నోవర్‌తో బ్రాంచిని అభివృద్ధి చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారని వివరించారు.

జోన్ - 2 'స్పందన'కు 17 అర్జీలు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు జోన్ పరిధిలోని పలు వార్డుల నుంచి 17 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అప్పలరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ వర్క్స్ విభాగానికి – 6, టౌన్‌ప్లానింగ్ – 7, విద్యుత్ శాఖ – 01, హార్టికల్చర్ – 01, రెవెన్యూ విభాగానికి – 02 చొప్పున వినతులు అందాయి. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు అయిదు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి రెండు, ప్రజారోగ్య విభాగానికి ఒక వినతిపత్రం వచ్చింది. వీటిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని జెడ్సీ రాము తెలిపారు.

చిన విజయరామరాజుకు ఘన నివాళి

పద్మనాభం: పద్మనాభం యుద్ధంలో బ్రిటిష్ వారితో పోరాడి పద్మనాభంలో అమరుడైన పూసపాటి రెండో చిన విజయరామరాజు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన సమాధి వద్ద భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పల నరసింహరాజు సోమవారం నివాళులర్పించారు. నూతనంగా ఏర్పాటు చేసిన రెండో చిన విజయరామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, ఎం.అప్పలరమణ, కె.వెంకటరమణ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

విజయరామరాజు ధీరత్వానికి పద్మనాభ యుద్ధం సాక్ష్యం

తగరపువలస: రెండో విజయరామరాజు ధీరత్వానికి పద్మనాభ యుద్ధమే సాక్ష్యమని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. పద్మనాభ యుద్ధ ఘటనలో అసువులు బాసిన రెండో విజయరామరాజు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు ఆ యుద్ధ విశేషాలను వివరించారు. 1794 జూలై 10న పద్మనాభం వద్ద జరిగిన యుద్ధంలో మద్రాసు గవర్నర్ జాన్ ఆంద్రూస్ తరపున వచ్చిన బ్రిటిష్ కల్నల్ పెందర్‌గాస్ట్ చేతిలో విజయరామరాజు వీరమరణం పొందారన్నారు. అప్పటి నుంచి విజయనగరం పూర్తిగా బ్రిటిష్ పాలనలోకి వచ్చిందని వివరించారు.



రెండో చిన విజయరామరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పల నరసింహరాజు, తదితరులు

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.35.78 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో హుండీల ఆదాయ లెక్కింపును సోమవారం నిర్వహించారు. మే 20వ తేదీ నుంచి ఈ నెల 10 వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.35 లక్షల 78 వేల 210 నగదు రాగా, 69 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 875 గ్రాముల వెండి వచ్చింది. 140 యూఎస్ఏ డాలర్లు, బ్యాంక్ నయాగరాకు చెందిన ఒక రింగట్, యూఏఈకి చెందిన 5 ధీరమ్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్‌కు చెందిన 5వేల రియాల్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, అయ్యప్పనగర్ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి, శ్రీహరిసేవా సంఘం సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ డి.ధనుంజయ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేవళ్లపాలెం రోడ్డు పునర్నిర్మాణం



రేవళ్లపాలెం రోడ్డుపై హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో రేవళ్లపాలెం గ్రామంలో 30 మంది గ్రామస్తుల టీడీఆర్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న రోడ్డు సమస్య ఎట్టకేలకు పరిష్కారమయింది. గ్రామం మధ్యలోని రోడ్డుకు పెద్ద పెద్ద గోతులు పడడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ విషయం కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక ద్వారా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలు మేరకు జీవీఎంసీ అధికారులు రోడ్డును సోమవారం పునర్నిర్మించారు. టీడీఆర్ సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు హామీ ఇచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.రమణ చెప్పారు. రోడ్డు నిర్మాణంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com